క్లుప్తంగా

పరామర్శ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ములకనూరుకు చెందిన స్వతంత్ర్య సమరయోధుడు బొజ్జపురి వెంకటయ్య అనారోగ్యం బారిన పడగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. వెంకటయ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. 'చాడ' వెంట సీపీఐ నాయకులు చాడ శ్రీధర్, ఆదరి శ్రీనివాస్ ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఐనవోలు : పోలీసులను దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి మండలంలోని పంథిని గ్రామానికి చెందిన చిర్ర శ్రీనివాస్ అనే వ్యక్తి 100 డయల్ చేసి అదే గ్రామానికి చెందిన బండి రవితో గొడవ జరుగుతుందని పోలీసుల సహాయం కావాలని కోరాడు. దీంతో పెట్రోలింగ్ వాహనంలో పంథినికి వెళ్లిన కానిస్టేబుల్ గొడవకు కారణం అడుగుతున్న క్రమంలో బండి రవి ఇష్టానురీతిగా పోలీసులను దుర్భాషలాడినట్లు తెలిపారు. కాగా బుధవారం ఉదయం రవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాయిద్యకారుడి మృతి


మోహినుద్దీన్ (ఫైల్)


ఐనవోలు : మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సన్నాయి వాయిద్యకారుడు ఎండీ.మోహినుద్దీన్ (54) గుండె సంబంధిత సమస్యతో బుధవారం మృతిచెందినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. దేవాలయంలో 24 సంవత్సరాలుగా సన్నాయి వాయిద్యకారుడిగా మోహినుద్దీన్ సేవలందించినట్లు తెలిపారు. కాగా మోహినుద్దీన్ కుటుంబ సభ్యులకు ఈఓ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్



వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టొచ్చని స్థానిక ఎస్సై చందర్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు ఆయన సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. లాటరీ తగిలిందని, ఇతర ప్రలోభాలకు గురి చేసేలా అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని చెప్పారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్న క్రమంలో ప్రజలు చైతన్యవంతం కావలని సూచించారు. మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

9నుంచి కంఠమహేశ్వర స్వామి బోనాలు



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లిలో ఈనెల 9 నుంచి 13 వరకు శ్రీకంఠమహేశ్వరం స్వామి బోనాలు నిర్వహిస్తామని మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ తెలిపారు. ఆ గ్రామంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బోనాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బొట్టు పెద్ద మనుషులు కట్ల సుధాకర్, బుర్ర వెంకటేశ్వర్లు, సంఘం అధ్యక్షుడు బుర్ర ఆనంద్, ఉపాధక్షుడు బత్తిని అశోక్, కార్యదర్శి కక్కెర్ల కుమారస్వామి, కోశాధికారి తాళ్లపెల్లి అశోక్, నర్సంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మేర్గు శ్రీనివాస్, కమిటీ సభ్యులు కట్ల కనకయ్య, మంచిక రవీందర్, బూడిది రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలి'

ఖానాపురం : ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి గొంది నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మంగళవారిపేటలో బుధవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని జీవించాల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి ప్రజాస్వామ్యాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. నాయకులు నర్సయ్య, ఉపేందర్, కిరణ్, శ్రీను, సంజీవ, వెంకన్న పాల్గొన్నారు.

నిరుపయోగంగా హాస్టల్ భవనాలు


భవనం చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు


నిరుపయోగంగా ఉన్న బాలికల హాస్టల్ భవనం

- శిథిలావస్థకు చేరిన వైనం
- విషకీటకాలకు స్థావరాలు
- పట్టించుకోని అధికారులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలో 22 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వ హాస్టల్ భవనాలు నిరుపయోగంగా మారడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి మంత్రి కడియం శ్రీహరి మండల కేంద్రంలో ఒకే చోట మండల సముదాయాల నిర్మాణాలు చేపట్టేందుకు స్థలం కేటాయించారు. ఈ క్రమంలో ఆ సముదాయాల ఆవరణలో 2003 సంవత్సరంలో నాటి ప్రభుత్వం విద్యార్థుల వసతి కోసం లక్షలు వెచ్చించి సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్ భవనం, అదే విధంగా ప్రభుత్వ బాలికల వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ హాస్టల్ భవనాలు నిర్మించారు. నాడు విద్యార్థులు ఆ హాస్టళ్లలో ఉంటూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేవారు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువు మానేసి రెసిడెన్సియల్ పాఠశాలల్లో చేరారు. దీంతో హాస్టల్ భవనాలను విద్యార్థులు కాళీ చేశారు. అప్పటి నుంచి నిరుపయోగంగా మారిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల చుట్టూ చెట్లు ఏపుగా పెరగడంతో విషపురుగులు, జంతువుల స్థావరాలుగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో భవనాల గేట్లు, డోర్లు కూడా ధ్వంసమయ్యాయి. అయితే ధర్మసాగర్ మండలానికి మంజూరైన సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలకు పక్కా భవనాలు లేక కొద్దికాలం పాటు దేవాదుల క్వార్టర్లలో పాఠశాల తరగతులను కొనసాగించారు. ఆ తర్వాత సరైన వసతి, సదుపాయాలు, సౌకర్యాలు లేకపోవడంతో ఆ పాఠశాలను హనుమకొండ నగరానికి మార్చారు. ఈ క్రమంలో మండలానికి మంజూరైన బాలికల రెసిడెన్సియల్ పాఠశాల నగరానికి మారడాన్ని స్థానిక ప్రజలు తప్పుపడుతున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బాలికల హాస్టల్ భవనాల స్థితిగతులను పరిశీలించారు. కాగా మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న రెండు హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేయించి ఆ భవనాల్లో రెసిడెన్సియల్ పాఠశాలను కొనసాగించాలని, లేదా ఏదైనా ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకునేలా ప్రభుత్వం చొరవ చూపాలని మండల ప్రజలు, స్థానికులు తదితరులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న భవనాలు

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అంకురార్పణ చేస్తున్న అర్చకులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీశివ మార్కండేయ స్వామి ఆలయాలల్లో బుధవారం శ్రీద్వాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. భద్రకాళి దేవస్థానం అర్చకుడు గణేశ్ ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో అంకురార్పణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు


రోడ్డు పక్కన పూడ్చకుండా వదిలేసిన గుంత

మాందారిపేట నుంచి శాయంపేటకు వెళ్లే రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా రోడ్డుకు అవతలి వైపున 10 రోజుల క్రితం మిషన్ భగీరథ మేయిన్ పైప్‌లైన్ లీకేజీ అయ్యింది. గమనించిన మిషన్ భగీరథ సిబ్బంది మరమ్మతుల కోసం గుంతను పైప్‌లైన్ మరమ్మతు చేశారు. అనంతరం గుంతను పూడ్చకుండా అలానే వదిలేశారు. పొరపాటున గుంతలో ఎవరైనా పడితే గాయపడడంతో పాటు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంత పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదాలు జరుగకముందే స్పందించాలని కోరుతున్నారు.

\- శాయంపేట

'పది'లో ప్రభుత్వ పాఠశాలల హవా

- మంచి మార్కులు సాధించిన విద్యార్థులు
- అభినందించిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

కమలాపూర్ : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు బుధవారం వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. కమలాపూర్‌లోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన కె.సాత్విక్ 572 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవగా.. కె.ధనుష్ 563, ఎస్.ఉదయ్‌సాయి 559 మార్కులు, జెడ్పీహెచ్‌ఎస్ గూడూరు పాఠశాలకు చెందిన టి.సాయి సిద్ధార్థ 558 మార్కులు, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన జి.పూజిత 555 మార్కులు, తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన సముద్రాల భరత్ 553 మార్కులు సాధించారు. శనిగరం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కె.అభిరామ్ 543, కమలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు)కు చెందిన డి.వాణి 537, ఉప్పల్ జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు)కు చెందిన ర్యాకం అక్షయ 534, కమలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ (బాలురు)కు చెందిన ఎం.వంశీ 531, కేజీబీవీకి చెందిన బి.శ్రీజ 516, అంబాల జెడ్పీహెచ్‌ఎస్ కు చెందిన బి.దీక్షిత్ 502, మర్రిపల్లి గూడెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఇంగె అక్షయ 492, మాదన్నపేట జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎన్.సౌమ్య 477, ఉప్పల్ జెడ్పీహెచ్‌ఎస్ (బాలురు)కు చెందిన పి.సాయిచరణ్ 458, కన్నూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కస్తూరి రాంచరణ్ 449, వంగపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కి చెందిన ఆర్.హర్షిత్ 429, శ్రీరాములపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కి చెందిన జి.అఖిల 402 మార్కులు సాధించారు.

తొమ్మిది పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత..

మండలంలోని ఎంజేపీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలు, భీంపల్లి, మర్రిపల్లిగూడెం, శనిగరం, శ్రీరాములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కమలాపూర్‌లోని కేరళ మోడల్ స్కూల్, శనిగరంలోని శ్రీచైతన్య హైస్కూల్, మర్రిపల్లిగూడెంలోని కాకతీయ విద్యాలయం వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 620 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 92.26 శాతంతో 572 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

ఆత్మకూరు : మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. 318 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 296 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 93 శాతం ఫలితాలు సాధించినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పెద్దాపూర్ జెడ్పీ హైస్కూల్, నీరుకుళ్ల జెడ్పీ హైస్కూల్ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అక్కంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి యాసాల సాయిచందు 563 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. సాయిచంద్‌ను పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే గుడెప్పాడ్‌లోని పెద్దాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎస్ .శ్రీజ 562, వి.ఇందిరా ప్రియదర్శిని 558, కొలిపాక ఆకాంక్ష 551, మేరుగు శ్రీచందన 551 మార్కులు సాధించారు. అలాగే తిరుమలగిరి కేజీబీవీ విద్యార్థిని పి .నవత 520 మార్కులు సాధించగా.. మండల కేంద్రంలోని స్పెక్ట్రా హైస్కూల్ విద్యార్థిని ఎల్. అనూహ్యరెడ్డి 542 మార్కులు సాధించారు.

ఎల్కతుర్తి : మండలంలో పదవ తరగతి వార్షిక పరీక్షలకు బాలురు 123, బాలికలు 228 మంది హాజరు కాగా బాలురు 105 మంది, బాలికలు 211 మంది ఉత్తీర్ణత సాధించగా 92.03శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ చదువుల సత్యనారాయణ తెలిపారు. మండల టాపర్లుగా తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన మాల నాగలీల 554 మార్కులు, కేజీబీవీకి చెందిన మాదారపు ఆలేఖ్య 536 మార్కులు, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఉడుత తేజస్విని 531 మార్కులు సాధించినట్లు తెలిపారు.

భీమదేవరపల్లిలో..

భీమదేవరపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ సునీతారాణి తెలిపారు. మండలంలో 97.44శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. మొత్తం 352 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 343మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. వంగరలోని పీవీ రంగారావు బాలికల విద్యాలయానికి చెందిన కన్నవేణి సింధు 566మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. అలాగే ముల్కనూరులోని మోడల్ స్కూల్‌కు చెందిన దొండ అక్షయ 566మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

దామెర : పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ తెలిపారు. దామెర పాఠశాలకు చెందిన పెంట దివ్య 516 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. మండలంలో 94 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 88 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఒగ్లాపూర్ మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన ఎం.వినయ్ 537, ఎస్.స్వరాజ్ 527, ఏ.హేమచంద్ 523 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదే విధంగా పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రమేశ్‌లాల్ పేర్కొన్నారు.

శాయంపేట : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చిటన్లు ఎంఈఓ భిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థి ఆర్.సంజయ్ 529, బాలికల పాఠశాల విద్యార్థి ఎన్.అక్షయ 549, పెద్దకోడెపాక జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కొండా సాత్విక 528, గంగిరేణిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి గుగులోతు కమల్ నాయక్ 504, మాందారిపేట జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సీహెచ్.చరణ్ తేజ 401, గట్లకానిపర్తి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి హర్షత్ 484, పత్తిపాక జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి చందన 442, నేరేడుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన షమీనా 507, కాట్రపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన జి.శరణ్య 409, కేజీబీవీకి చెందిన ఎన్.కీర్తన 502, ఎంజేపీకి చెందిన భయ్య మహేష్ 567, గుర్రపు అక్షయ్‌కుమార్ 560, సోషల్ వెల్ఫేర్‌కి చెందిన పి.పౌషిక 551 మార్కులు సాధించినట్లు ఎంఈఓ భిక్షపతి తెలిపారు.

పరకాల : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ ఎస్.రమాదేవి తెలిపారు. పరకాల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు (13 మంది), నాగారం ఉన్నత పాఠశాల(8 మంది) 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. మండల కేంద్రంలో అత్యధిక విద్యార్థులు ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 41 మంది పరీక్షలు రాయగా 37 మంది విద్యార్థులు (90 శాతం ఉత్తీర్ణత) సాధించినట్లు తెలిపారు. అదే విధంగా వెల్లంపల్లిలో నలుగురు విద్యార్థులకు గాను ముగ్గురు(75శాతం), ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8 మంది విద్యార్థులకు గాను 5గురు (83శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కాగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 37 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తుల మధు తెలిపారు. ఎం.వర్షిత 557 మార్కులు, బి.శ్రీసుశృత 543 మార్కులు సాధించినట్లు తెలిపారు.

ఐనవోలు : మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ, ఎంజేపీ, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలల్లో 342 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 315 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ పులి ఆనందం తెలిపారు. జెడ్పీహెచ్‌ఎస్ వెంకటాపూర్, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్, ఎంజేపీలలో మాత్రమే నూరు శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. కేజీబీవీలో చదివిన ఎస్.సిరి 569/600 మండల టాపర్‌గా, ఎంజేపీలో చదివిన డి.చింటు 560/600 ద్వితీయస్థానం నిలిచినట్లు పేర్కొన్నారు.

వేలేరు : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఎంఈఓ చంద్రమౌళి తెలిపారు. మొత్తం 282 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 264 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాల విద్యార్థి కే. భరత్ కుమార్ 551 మార్కులతో మండల టాపర్‌గా నిలువగా కస్తూర్బా పాఠశాలలో 37 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 37 మంది ఉత్తీర్ణత సాధించారని, కే.వర్షిణీ 521 మార్కులు సాధించినట్లు స్పెషలాఫీసర్ స్రవంతి తెలిపారు.


కె.సాత్విక్


సాయి చందు


ఎస్.శ్రీజ


ఇందిరా ప్రియదర్శిని


ఎం.వినయ్


బి.శ్రీసుశృత


ఎస్.సిరి


జి.అక్షయ్ కుమార్

ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నేటి నుంచి ఆర్ట్, క్రాఫ్ట్, హ్యాండ్ రైటింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నేటి నుంచి 12వ తేదీ వరకు వేసవి ఉచిత శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు గురువారం ఉదయం 8 గంటలకు పాఠశాలకు హాజరుకావాలని సూచించారు.

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ బాలికల ఉన్నత పాఠశాలలో నేటి నుంచి 15వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం వి.వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనవచ్చని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే క్యాంపులో ఇండోర్ గేమ్స్, బేసిక్ మ్యాథ్స్, డ్రాయింగ్, పేయింటింగ్, క్రాఫ్ట్, ఆర్ట్స్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. సమ్మర్ క్యాంపులో పాల్గొనేందుకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గణేశ్ సస్పెన్షన్ సరికాదు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పాడిశెట్టి గణేశ్‌ను పార్టీ నుంచి బహిష్కరించడం సరికాదని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. పాడిశెట్టి గణేశ్ 2001 నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతూ మలిదశ ఉద్యమంలో పాల్గొని కేసులపాలయ్యాడని గుర్తు చేశారు. ఈ మధ్య కాలంలో వచ్చిన కొంత మంది నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పార్టీలో వర్గాలు లేవని అధినేత కేసీఆర్ తమ నాయకుడని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకపోవడం వాస్తవమేనని అన్నారు. గణేశ్‌పై బహిష్కరణను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పార్టీ బలోపేతానికి అందరి కృషి అవసరమని అన్నారు. అనంతరం ఉద్యమ సమయంలో గణేశ్‌పై నమోదైన కేసుల ఎఫ్ఐఆర్ కాపీలను చూపించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు మహేందర్, శంకర్, సారయ్య, తరుణ్‌గోపి, వీరయ్య, రాజిరెడ్డి, విజయ్, సాయి, సాగర్, విజయ్, రాజేశ్ పాల్గొన్నారు.

పౌరులందరికి సమాన హక్కులు

- తహసీల్దార్ సత్యనారాయణ

శాయంపేట : పౌరులందరికి భారత రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని తహసీల్దార్ కల్వల సత్యనారాయణ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో గల దళిత కాలనీలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955 అనుసరించి అంటరానితనం, ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అట్రాసిటీ కేసు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని, ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఒకరిపై ఒకరు వివక్ష చూపితే చట్టరీత్యా నేరమవుతుందని, కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని పిలుపునిచ్చారు. అన్ని కులాల, వర్గాల వారు సోదర భావంతో మెలగాలని అన్నారు. సమాజంలో కుల వివక్షతను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని, దళితులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అందరూ సహకరించాలని అన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎస్సై జక్కుల పరమేశ్, ఆర్ఐ రమేశ్, ఏఎస్ఓ, రెవెన్యూ సిబ్బంది దళిత కాలనీవాసులు పాల్గొన్నారు.


శాయంపేట : మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

దామెర : రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం వాటిల్లితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అసమానతలు లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల, మత, వర్ణబేధాలు లేకుండా ఐకమత్యం, సోదరభావంతో ఉండాలని సూచించారు. సమావేశంలో విద్యుత్ ఏఈ గుర్రం రమేశ్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజిత పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులకు ప్రాధాన్యం ఇవ్వాలి

నర్సంపేట : ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రమేశ్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత లోపించిందని చెప్పారు. పేదలను విస్మరించి ఇష్టారీతిన లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేదలకు ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. అలాగే పేదలు నివాసిస్తున్న కాలనీల్లో వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, యూపీఎస్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకులు ముప్పారపు రాజేందర్, బైరబోయిన నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరకాల బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ



పరకాల : అక్షయ తృతీయ సందర్భంగా పరకాల బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు బుధవారం చలివేంద్రం నిర్వాహకులు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్టీసీ డీఎం రవిచంద్ర చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉచితంగా మంచినీటిని అందించడంతో పాటు ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన అరుణ ఫర్టిలైజర్ యజమాని గండె వెంకటేశ్వర్లు, గంగా వాటర్ ప్లాంట్ యజమాని లక్ష్మీనారాయణ, సంజయ్ మెడికల్ స్టోర్ యజమాని సంజయ్‌ని ఆర్టీసీ డీఎం అభినందించారు.